వరూధిని

ప్రదేశము.—హిమాలయపర్వతశిఖరము. చుట్టుపట్ల పుష్పించిన చెట్లూ, చెట్లమీద కిలకిలలాడే పక్షులూ వున్నవి. వృక్షాగ్రముల మీద తెల్లగా ముద్ద కట్టివున్న మంచు బొట్లు బొట్లుగా కారుతూ వున్నది. భూమి పర్వతమయ మైనప్పటికీ మంచు రాలి తెల్లగా మెత్తగా వున్నది. అప్పుడప్పుడు జింకలమంద ఆప్రాంతాలకు వచ్చి గంతులు వేయబోతూ మంచువల్ల గెంతలేక నెమ్మదిగా నడిచి పోతున్నది. కనుచూపుమేరలో హిమసౌధ మొకటి కనబడుతూ వున్నది. ఆవైపు నుంచి చల్లనిగాలి వీస్తూ నలుగడలా సువాసనలు చిమ్ముతున్నది. చేతులనిండా పువ్వులూ పళ్ళూ పట్టుకొని ప్రవరుడు ప్రవేశిస్తున్నాడు. వయస్సు ముప్పై సంవత్సరములు. ఆరుఅడుగుల ఎత్తు వున్నాడు. దేహము పసుపురంగు. మీసము లేదు. నీరుకావి బట్ట, చిళ్ళగోచి, కుచ్చెళ్ళుపోసి కట్టుకున్నాడు. పైన నీరుకావి వుత్తరీయము కప్పుకున్నాడు. చెవులకు బంగారుకుండలా లున్నవి. చేతిలో పళ్ళూ పువ్వులతోపాటు రాగిఝారీచెంబూ వున్నది. బుజముమీద గావంచా వున్నది. మిట్టమధ్యాహ్నము. కింద మంచు కాళ్ళకు జివ్వుమని తగలడముచేతా పైన మధ్యాహ్నసూర్యుని కిరణముల ధగధగచేతా అతను అలసి విసికినట్లు మొగము చెప్పుతోంది. మొగముమీదా ఒంటిమీదా చెరిగి పోతున్న విభూతిపిండెకట్లు కలవు. అతను హిమసౌధమువేపు కొంచెము నడిచి కూచుని వుత్తరీయములో పళ్ళూ పువ్వులూ మూటగట్టి బుజాన వేసినాడు. గావం

చాను ఝూరీచెంబు కట్టి రెండవ భుజము మీద వేసి లేచి, చేతులు పైకెత్తి, ఆకాశము వేపు చూస్తూ]

ప్రవరుడు

జయ సీతారాం! [అని ఎగిరినాడు తాను అనుకొన్నట్టు ఆకాశము మీదకు పోక మంచులో పడ్డాడు మళ్ళీ]

ప్రవరుడు

జయ సీతారాం! [యథాప్రకారము మంచులో పడ్డాడు]

ప్రవరుడు

సిద్ధుడు మోసం చేశాడా ఏమిటి చెప్మా! అవును, వచ్చిన గోసాయీవాడినల్లా నమ్మితే ఏమవుతుంది? మోసమే అయితే మొదటినుంచీ మోసం కాని తీరా యిక్కడకు వచ్చాక మోసం ఏమిటి? అయినా కాలికి పసరు వున్నంతకాలం స్వేచ్ఛాగమనం చెయ్యవచ్చునని సిద్ధుడు చెప్పినాడు గా. [అని పాదములు శోధించి చూసుకొని]

ఇంకేముంది! పుట్టి మునిగింది! ఈ మంచుకొండ విడిచి ఇంటికి వెళ్ళే సాధనం ఏమిటి?

[దిగాలుపడి మంచులో కూర్చున్నాడు. మంచు సౌధములోనుంచి దివ్య స్త్రీ బయటకు వస్తుంది. ఆమె పేరు వరూధిని, వయస్సు పదహారేళ్ళు వుండవచ్చును. అయిదడుగుల అరంగుళముల పొడుగు. శరీరచ్ఛాయ మంచుతో జాఫరారంగు మిళితము చేసినట్లుంది. ఏవిధమైన వస్త్రమున్నూ ఆమె ధరించలేదు. పొగమంచు ఆమె శరీ

రాన్ని వస్త్రమువలె కప్పింది. ఆమె చేతిలో ,చితారు వున్నది. తంత్రులు తమంతట తామే పలుకుతున్నవి. ఆమె వెన్నంటి ఒక జింక పిల్ల వస్తోంది. ఆమెను చూచి పక్షులామె మెడమీదా తలమీదా వాలుతున్నవి. వాటి నామె తరిమి వేసింది. బయటకువచ్చి]

వరూధిని

ఎవరో మేఘగంభీరస్వరముతో సీతారాముల పేరు ఎత్తినారు?

[నలువంకలా పరీక్షించి చూచి ప్రవరుడున్నచోటు గుర్తించి ఆశ్చర్య సంభ్రమాలతో అతన్ని సమీపించి]

ప్రేమమూర్తీ, నీ వెవరు?

ప్రవరుడు

[ఆశతో మొగమెత్తి ఆమెను చూచి, తటాలున మొగము వంచుకున్నాడు. మాటాడలేదు.]

వరూధిని

సౌందర్యరాశీ, నీవు కంతుడవా?

ప్రవరుడు

[మొగము చిట్లించుకొని మాటాడలేదు.]

వరూధిని

వాక్కులేని ఈ అందపుముద్ద ఎక్కడనుంచి వచ్చి పడిందో!

ప్రవరుడు

[చెట్టునుంచి అప్పుడేరాలిపడిన పువ్వును చేతితో పట్టుకొని దాన్ని వేళ్ళతో తిప్పుతూ] అమ్మా! నాయింటికి తెరువు చూపవా! ఆర్యావర్తము పోవలె నేను.

వరూధిని

[జింకపిల్ల ప్రవరుని సమీపించి అతనిచేతులో పువ్వు నాలుకతో అందుకొంటుండగా దాన్ని ఇవతలకు లాగివేసి] మొగమెత్తి మాటాడరాదా, మోహనాకారా?

ప్రవరుడు

నగ్నస్త్రీని ఎలా చూడగలనమ్మా?

వరూధిని

ఇప్పుడేగదా నాజింకపిల్లను చూశావు!

ప్రవరుడు

అది జంతువు.

వరూధిని

ఓహో! నేను నాకళ్ళతో నీసౌందర్యాన్ని ఆస్వాదించడం లేదా!

ప్రవరుడు

నాశరీరం ఆచ్ఛాదితమే.

వరూధిని

నీసౌందర్యం అనాచ్ఛాదితము. ఎక్కడ శాసనా లివి నాముందు ఏకరువు పెట్టుతున్నావు నా రాజా?

ప్రవరుడు

ధర్మశాస్త్రవిరుద్ధమైనకార్యాలను నేనా—ఈహిమవత్పర్వతముమీదనా—ఎలా చేయగలను? నాకు ఇంక పుట్టగతు లుంటవా?

వరూధిని

మానవశాసనాలసంగతా మాట్లాడుతున్నావు? ఇట్టి విపరీతశాసనాలు, నవ్వు పుట్టించేశాసనాలు మానవలోకంలో కలవట! నారదుడు చెప్పగా విన్నాను. ఓహోహో! [అని పకపకా నవ్వుతున్నది. ఎర్రనిపెదవులు విడినవి. మంచుననెతెల్లగా తీర్చి దిద్దిన ట్లున్నదంతాలు కనబడుతున్నవి. నేత్రములనుంచీ నవ్వు వస్తున్నది.]

ప్రవరుడు

శరీరాచ్ఛాదనము మానవశాసనమా?

వరూధిని

కాదా మరి? అయ్యో, నీవిషయమై నే నెంత అపచారము చేస్తున్నాను! నీతో వాదన పెట్టుకొందునా, మనోహరమూర్తీ!

ప్రవరుడు

పితృపూజకూ దేవతార్చనకూ వేళయింది. నాకు తెరువు చూపవా తల్లీ!

వరూధిని

ఓహో! ఎంత అదృష్టం. మానవులసంగతి వినడమేకాని కనడంలేదు. మానవు లంతా యీలాగ వుంటే నా కింక దివ్యలోకం ఎందుకు! ఓమానవుడా! నాహిమధామానికి రావా? అక్కడ నీ కన్నీ చెప్తాను.

ప్రవరుడు

నిన్ను కన్నెత్తిచూస్తూ నీహిమధామానికి నేనెట్లా రాగలను?

వరూధిని

నీసందేహాలు హాస్యాస్పదంగా వున్నవి!

[పిరుదలను దాటి వేలాడుతున్న శిరోజాలను ఆమె ముందు భాగానికి దీసి వక్షముమీదినుంచి తొడలవరకూ వ్యాపించి ఆయా భాగాలను సగము సగము కప్పేటట్లు చేసింది. శిరోజాల సందునుంచి ఆమె శరీరచ్ఛాయ ధూమపంక్తులమరుగునుంచి వెలువడె అగ్నిజ్వాలకాంతులవలె వున్నది.]

ప్రవరుడు

నాయింటికి మార్గం చూపిస్తే యిక్కడనుంచే వెళ్ళిపోతాను.

[అంటూ లేచి ఆమెకు ఎదురుగా నిలబడి హిమసౌధంవేపు చూస్తున్నాడు.]

వరూధిని

నాకు నీ వతిథివి. సావకాశంగా కూర్చుని మాట్లాడి నీ కతిథిసత్కారం చేసినపిమ్మట గాని నిన్ను వెళ్ళనివ్వను.

[అని కిలకిల నవ్వుతూ అతని చెయ్యి పట్టుకో బోయింది. అతడు తప్పించుకొని హిమసౌధము వేపు తల వంచుకుని నడవడం మొదలుపెట్టినాడు. వరూధిని సంతోషం పట్టలేక జింకపిల్లను ఎత్తుకొని అతనివెంట మందగమనంతో కొంతదూరం పోయింది. వీస్తూన్న గాలివల్ల ఆమె శిరోజములు కొన్నిమళ్ళీ వెనక్కుపోయినవి. ఒకకోకిల ఆమె భుజముమీద వాలి కుహూ అని కూజితము చేసి ఎగిరిపోయినది. ఆమె అతనికి ముందుగా పరుగెత్తి హిమధామాన్ని చేరింది.]

రా, నాయింద్రా, రా, ఈపుష్పశయ్య నధిష్టించు.

[హిమధామములో నవరత్నాలు పొదుగుటచేతనైన వివిధపుష్పములు గోడలమీద కలవు. గదికిమధ్య పుష్పశయ్య వజ్రపీఠిమీద అమర్చబడివున్నది. శయ్య కిరుపక్కలా పచ్చలచిలుకలు కలవు. పుష్పశయ్యకు పైన రత్నములగుత్తులు పూగుత్తులవలె వేలాడుతున్నవి. వాటికాంతులు సౌధమంతా పలురంగులతో నింపినవి. పుష్పశయ్య కెదురుగాను పక్కలను మణిపీఠాలు కలవు. వాటిమీద పత్రశయ్య లున్నవి. గోడచుట్టూ చంద్రకాంత శిలావేదికలు

కలవు. వాటిమీద వుంచినమణిపాత్రలలో మిలమిలలాడే ద్రవము కలదు. ఇంపైన నునువెచ్చనిగాలి సౌరభభరితమై వీస్తున్నది. మణిపీఠముపైన వీణ కలదు. జింకపిల్లను కిందకు దింపి, చేతిలో చితారు మణిపీఠముపైన వుంచి చితారు నుద్దేశించి]

నీ వింక పలకకు. నీపాటలను ఈనాచిత్తచోరుని పలుకులు సిగ్గుపరచడం లేదా? నీ వెందు కింకా పాడుతావు?

[చితారు పలకదు. పుష్పశయ్యమీద మూట దింపి ప్రవరుడు మఠము వేసుకొని కూర్చుండును. అతనికెదురుగా పాదములు వెనుకవైపునకుపెట్టి ఒకపీఠము మణిపీఠముపైన అని వరూధిని కూర్చున్నది. శిరోజములతో మల్లివత్తో దేశమును కప్పుకొన్నది]

ప్రవరుడు

ఈమాటేనా నాయింటికి దారి చూపించవా?

వరూధిని

[అతనిమూట చేతితో పట్టుకొని విప్పుతూ నవ్వుకొంటూ]

మీబట్టలివా! అబ్బా! ఎంత మోటుగా వున్నవి! చితారుతీగె లల్లినట్లు ఎంత దట్టముగా వున్నవి! ఔరా, ఔరా, యి వేమిటి?

ప్రవరుడు

[కొంచెము తల యెత్తి] పళ్ళు.

వరూధిని

ఎక్కడ సంపాదించావు వీటిని?

ప్రవరుడు

ఈ కొండశిఖరం మీదనే.

వరూధిని

ఎందుకూ?

ప్రవరుడు

తినడానికి.

వరూధిని

ఎవరు?

ప్రవరుడు

మేము.

వరూధిని

పక్షులూ జంతువులూ తినేవి నీవు తింటావా నా మణికిరీటమా?

ప్రవరుడు

నీ వేమి తింటావు?

వరూధిని

అమృతము.

ప్రవరుడు

దేవతా స్త్రీసందర్శనము ఎంతపుణ్యము! ఈమెకు మొక్కుకొందునా?

వరూథిని

ఏమిటి, నోట్లో గొణుగుకొంటున్నావు? గట్టిగా మాట్లాడు నారాజా, గట్టిగా మాట్లాడు! నీమాటలు నాహృదయాన్ని పూరిస్తున్నవి. మాట్లాడ వేమి నా స్వామీ? నీమాటలు అమృతాన్నీ దివ్యవీణనూ మర పునకు తెస్తూవున్నవి.

ప్రవరుడు

మీకు మరుపు వున్నదా?

వరూథిని

ముఖ్యాంశముల వెనక అముఖ్యాంశములు ఒదగడమే మామరవు. అవును గాని ఇవి వేమిటి?

ప్రవరుడు

పువ్వులు.

వరూథిని

[ఒక్క పువ్వును దీసి స్తనసీమమీద వాలిన కురులలో పెట్టుకొంటున్నది.]

ప్రవరుడు

ఆఁ, ఆఁ, వద్దు, వద్దు!

వరూథిని

ఏమిటి, నారాజా, ఏమిటి?

ప్రవరుడు

దేవపూజ కేర్పాటైన ఆపువ్వును నీవు ధరించ రాదు!

వరూథిని

నీయిష్టము వచ్చినట్లే చేస్తాను, ప్రేమమూర్తీ! ఈ పుష్పాలు పూజ కేనా, తింటానికి కూడానా!

ప్రవరుడు

తినరు, పూజ కే.

వరూథిని

[గట్టిగా పకపక నవ్వుతూ]

పక్షులు తినేపళ్లు తింటారు! తుమ్మెద లాస్వాదించే పువ్వులు పూజ చేస్తారు! చిత్రం! ఈమానవుల చర్యలన్నీ వింతలే! పోనీగాని, నాయింద్రా నాచిత్తచోరా, మొగముమీదా నంటిమీదా ధూళి పడ్డదేమి?

ప్రవరుడు

ధూళి కాదు, విభూతి.

వరూథిని

ఓహో, శివరూపం ధరిస్తున్నావా, నారాజా! నా శిరోజములతో ఈభూతి తుడిచి పుప్పొడి గంధం నీవంటికి రాతునా?

[అని ముందుకు వాలినది. శిరోజములను చేతితో పట్టుకొని పైకెత్తినపుడు అతను ఆమె వైపు తిరుగగా అతనిదృష్టులు ఆమెవక్షస్సీమపైన పడినవి. తటాలున కళ్ళు మూసుకొని వెనుకకు జరిగి]

ప్రవరుడు

పుండరీకాక్షు! పుండరీకాక్షు! నన్ను ముట్టుకోకు, దూరంగా వెళ్లు, వెళ్లు!

వరూధిని

అయ్యో, అయ్యో! నీకు కోపం తెప్పించ లేదుకదా నాస్వామి! పోనిలే, యింకోమాట చెప్తాతా విను.

ప్రవరుడు.

దూరంగా వుండి చెప్పు.

వరూధిని

వాడిపోయే ఈపుష్పాలూ కుళ్ళిపోయే ఈపళ్ళూ నీకెందుకు? అవతల పారవేస్తావా! వానిబదులు నీకు వాడులేనిపుష్పములు సమర్పింతునా! తేనెతేటలూరే కమ్మియపండిన ఫలాలు అర్పింతునా!

ప్రవరుడు

నాకేమీ అక్కర లేదు. నే నింటికి పోవలె. నాకు మార్గము చెప్పవా?

వరూధిని

తామరదొన్నెలో పోసి తేటు లానని పద్మమధువు తెమ్మంటావా, నా రాజా!

ప్రవరుడు

వద్దు, వద్దు.

వరూధిని

నాగాయక సేవకు లైన యీపత్తు లన్నింటిచేతా సభ చేయించి నీ సౌందర్యగీతాలు పాడిద్దునా?

ప్రవరుడు

వద్దు, నే వెడతా.

వరూధిని

పోనీ, నేను నిన్నుగురించి ప్రేమగీతాలు ఆలాపిస్తాను వింటావా, నాకన్నా?

ప్రవరుడు

వద్దు, వద్దు.

వరూధిని

పోనీ! నామణిసౌధపుశోభలు చూద్దువు గాని లే, చూపిస్తా.

ప్రవరుడు

వద్దు.

వరూధిని

నేను చెప్పడానికిముందే వద్దంటావు. ఊకొట్టనైనా ఊకొట్టకూడదూ?

ప్రవరుడు

ఊఁ!

వరూధిని

ఆకాశగర్భాన మందాకినీనది పారుతున్నది. దాని గట్టుమీద చక్కని పొదరిండ్లు ఉన్నవి. ఏం?

ప్రవరుడు

ఊఁ.

వరూధిని

వియద్గంగా వీచికలపైన ఊగులాడే హంసదంపతుల ప్రియభాషణలు ఆపొదరిండ్లలో కూచుని విందాము, వస్తావా?

ప్రవరుడు

రాను.

వరూధిని

పోనీ, కల్పవృక్షచ్ఛాయలో రచ్చశిలమీద కూర్చుదాము, ఏం?

ప్రవరుడు

ఊఁ.

వరూధిని

అక్కడ చిలకలచేత పాటలు పాడిద్దాము. ఆపాటలకు సరిపోయేటట్లు నెమిళ్ళచేత నృత్యము చేయిద్దాము.

ఆఆటకూ పాటకూ సరిపోయేట్లు మనం తాళము వేద్దాము. రావా?

ప్రవరుడు

రాను.

వరూధిని

పోనీ, నందనవనములో పారిజాతవృక్షముకింద చంద్రకాంతోపల వేదికమీంద పుష్పపర్యంకాలు వరచి వుంటవి.

ప్రవరుడు

ఊఁ.

వరూధిని

వాటిపైన మనము పండుకొని రాధాకృష్ణగాథావళి చెప్పుకొందాము. ఈమారైన రావా?

ప్రవరుడు

రాను, రాను.

వరూధిని

పోనీ, ఈపర్వతాన మంచుకెరళ్ళపైన నడిచి నడిచి కైలాసశిఖరం చేరుదాము.

ప్రవరుడు

ఊఁ.

వరూధిని

చేరి ఆవకాంతసీమలో ఉమాశంకరుల లీలోద్యాన విహారాలు విలోకింతామా!

ప్రవరుడు

ఊఁహుఁ.

వరూధిని

పోనీ, మన మిద్దరమూ చెరివక మేఘముపైనా కూచుని ఆమేఘాలను ఆకాశపథాన పందెము వదులుదాము, ఈమాటైనా కానా!

ప్రవరుడు

రాను.

వరూధిని

చదలేటి తరంగాలపైన ఉయ్యాలలూగే బంగారు పద్మపీఠాలమీద మన మిద్దరమూ కూర్చుండి తేటి పాటలలోని వలపుతేటలను ఆస్వాదిద్దాము—ఈమారు.

ప్రవరుడు

రాను.

వరూధిని

తెల్లనిరాయంచ విప్పిన వెడదరెక్కలు రెంటిపైనా మన మిద్దరమూ కూచుండి చెట్టాపట్టాలు వేసుకొని ఒక్కమారు ఆకాశపథానికి ఎగురుదాము.

ప్రవరుడు

ఊం.

వరూధిని

ఎగిరి మానససరోవరానికి పోయి జలక్రీడలు ఆడుకొందాము నారాజా?

ప్రవరుడు

రాను.

వరూధిని

ఈకొండమీది వివిధరత్నములూ రాసులు పోయించి, వానిపైన సూర్యకిరణాలు ప్రసరిస్తుండగా పుట్టిన వేర్వేరు వర్ణాలతో ఈమణి సౌధానికి రంగులువేయించి ముగ్గులు పెట్టిస్తా, చూస్తావా?

ప్రవరుడు

చూడను. నా కేమీ అక్కర్లేదు. అబ్బా! నువ్వు కొంచెం చాటుగా కూచుందూ. నాకు మతి పోతున్నది!

వరూధిని

అయ్యో, అయ్యో, నా ప్రాణమా! నీకు నే నేమి అపచారం చేస్తున్నాను? ఇక్కడ కూచుందునా?

[వరూధిని లేచి అలవాటుచొప్పున కుంతలాలను వెనక్కు తోసినది. వక్షము అనాచ్ఛాదిత మయింది. ప్రవరునిపక్క వున్న మణి

ఫలకముమీద కూచుని పాదాలు వెనకకు చాపి ముందుకు వంగి మోచేతులను పువ్వులమీద మోపి కరతలములమీద మొగ మానించి అతనికేసి తేరిపారచూస్తూవున్నది. కురులు రెండుబుజములమీదినుంచీ కిందకు జారినవి.]

నాప్రాణమా! యిట్లా చూడు. నీకనుల వెలుగులు నన్ను తాగనివ్వవా? అయ్యో ఆనలునమీకు రెప్పపాటెందుకు పెట్టినాడు? చూడు నాకొండా, నాకేసిచూడు, నాలాంటి దేవతాస్త్రీని నీ వెప్పుడైనా చూశావా?

ప్రవరుడు

[ఆమెవైపు చూచి] నీకుంతలములే నీకు వస్త్రములకింద ఏర్పాటుకాబడినట్లు తోస్తుంది. వాటిపని వాటిని చెయ్యనియ్యి.

వరూధిని

[కురులు బుజముమీదినుంచి ముందుకు దిగజారేటట్లు చేసి] అమృతాంగా! నీ వెక్కడనుంచి నాకు ప్రసాదింపబడితివో చెప్పవా?

ప్రవరుడు

ఎంతనుంచి ఎంతకు వచ్చింది! పుణ్యభూమిదర్శనము చేసుకోరాగా పాపబుద్ధులు పుట్టడానికి మార్గము తటస్థమైంది!

వరూథిని

నరలోకప్రసంగతులు స్మరించడము మానివెయ్యవా, నాస్వామీ? ఇందుకళావతంసుని పావనపాదధూళిచేత పవిత్రీభూతమైన యీసీమలోనా పుణ్యపాపాల మాట తలపెట్టుతున్నావు!

ప్రవరుడు

నీ వేమోమో అప్రస్తుతప్రశంస చేస్తున్నావు. నన్ను దరిజేర్చగలశక్తి వుంటే చేర్చు. లేకపోతే నా దారిని నే పోతా.

వరూథిని

అమ్మో! స్వామి కిక కోపం వచ్చింది! అడుగు, నా కన్నా, అడుగు. నీ వడిగిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్తా. [సంభ్రమంగా లేచి మోకాళ్ళనూ పాదములనూ నేలపైన మోపి ముందుకు వంగి ప్రవరుడి మొగము చూస్తున్నది.]

ప్రవరుడు

మాయింటికి తెరువు.

వరూథిని

[జింకపిల్ల ప్రవరుని సమీపించి అతనికుండలములను నాలుకతో అందుకుంటున్నది. వరూథిని దానిని దగ్గరకు దీసి వక్షము దాని పైన మోపి తలదువ్వుతూ]

జింకపిల్లా, మాట్లాడేటప్పుడు అడ్డం రావచ్చునా?

ప్రవరుడు

[మొగ మెత్తి వరూధినిని తేరిపార జూచినాడు. వరూధిని ఆతన్ని తిరుగా చూసి చిరునవ్వు నవ్వింది. ప్రవరుడు సగము నవ్వి ఆపుకొని] నామీద నువ్వు మత్తుమందు చల్లలేదుకదా?

వరూధిని

అ దేమిటి?

ప్రవరుడు

ఏమీ లేదు. వేళ మీరిపోతోంది. ఇంటికి పోవాలి, తోవ చెప్తావా, చెప్పవా?

వరూధిని

ఎటువేపు నీయిల్లు నాస్వామీ?

ప్రవరుడు

వరుణానదీ శీకరములచేత ఎల్లవేళలా తడిసే అరుణాస్పదము.

వరూధిని

ఓహో, మాఅక్కగారూ ఆమెతోడలూ తరుచు విహారించే దేశమా?

ప్రవరుడు

మీ అక్కగా రెవరు?

వరూధిని

ఎరగవా, నాసొగసులకుప్పా! శ్రీమహాలక్ష్మి నాతో బుట్టువేగా.

ప్రవరుడు

జగదంబసోదరి వైన నిన్ను కన్నెత్తి చూడడానికి నా కేల సందేహము కలుగుతోంది!

వరూధిని

సందేహమా! సందేహా మెందుకూ! కళ్ళు మూయకుండా నాకేసి చూసిచూసి నాసౌందర్యాన్ని తాగరాదా ముద్దులమూటా! తోడి దేవతలకుసైతము దుర్లభ మైన యీనాలావణ్యజలముతో నీకు నా హృదయాన్ని ధారపోస్తున్నా నంటే చెయ్యి పట్ట వేమి, వెర్రిరాజా?

ప్రవరుడు

ధర్మవిరుద్ధకార్యాలు స్వర్గవాసులదగ్గిరనైనా నేను చెయ్యలేను.

వరూధిని

మీధర్మములు మీలోకము దాటి రాలేవు సుమా. చూడు, నాహృదయ మెల్లా నీకోసం తటతట కొట్టుకుంటూ ందో? [జింకపిల్లను దూరముగా తోసి వక్షమును చూపుతోంది.]

ప్రవరుడు

[అటుచూడకుండా జింకపిల్లకేసి చూస్తూ] నాహృదయము నాజననీ జనకులకోసం ఎట్లు కొట్టుకొంటున్నదో నీకు తెలియదు.

వరూధిని

[వినిపించుకోకుండా] చూడు, నా రాజా, చూడు, ఈహిమాద్రి సౌందర్యమును సూర్యుడు తనకరాలతో ఎలా అనుభవిస్తున్నాడో! నక్షత్రసౌందర్యమును చంద్రు డనుభవించడం చూడలేదా! లేకుంటే ఈరాత్రి చూతువుగాని లే. ఈవనలక్ష్మిసౌందర్యము వసంతు డనుభవిస్తున్నాడు. చూడవేమి నా రాజా? నేను వనలక్ష్మిని, నీవు నావసంతుడవు. అవునా?

ప్రవరుడు

నేను బ్రాహ్మణుడను.

వరూధిని

ఓహో, ఒకస్త్రీ హృదయము స్పందిస్తున్నప్పుడు దానితోపాటు నీహృదయంకూడా ఎప్పుడైనా స్పందించిందా నాస్వామీ?

ప్రవరుడు

ఇంద్రియసుఖాపేక్ష ధర్మమార్గానువర్తుల దగ్గిర వుండదు.

వరూధిని

ఇంద్రియసుఖమేనా ఆనందస్థితికి మూలకారణము?

ప్రవరుడు

కాకుంటే యీమాటలన్నీ ఎందుకు వచ్చేయి నీకు!

వరూధిని

అయ్యో, వెర్రి రాజా! ప్రేమసుఖాన్ని ఎంతచులకన చేశావు! చంద్రికాచంద్రులకు, ఉమామహేశ్వరులకు, పద్మినీ కమలబాంధవులకు, కైలాసశిఖర నక్షత్రమండలములకు ఐక్యభావానికి కారణం ఇదా?

ప్రవరుడు

మానవలోకపు సాంప్రదాయం నే చెప్పాను.

వరూధిని

కాదు. నారాజా, కాదు. మేఘగర్జనమున వాయువు స్పందిస్తుంది. శంకరావలోకనములచే బ్రహ్మాండం స్పందిస్తుంది. సూర్యావలోకముచేత పద్మహృదయము స్పందిస్తుంది. నిన్ను చూస్తే నాహృదయం స్పందిస్తుంది.

ప్రవరుడు

ధర్మబద్ధులకు జీవితంలో ఒక్కమారే హృదయ స్పందనము.

వరూధిని

నిన్ను దర్శించడంచేత మేల్కొన్న నూతనప్రేమ మారుతస్పర్శకు నదించే నాహృదయవీణాతంత్రుల శ్రావ్యగీతికలు నీకు వినిపించడం లేదా?

ప్రవరుడు

నా చెవులలో ప్రణవమే నదిస్తూంటుంది.

వరూధిని

చిన్నికృష్ణుని వేణుగానమైనా నీచెవులలో చొరదా?

ప్రవరుడు

ఓంకారరూపముగా పడుతుంది.

వరూధిని

అయ్యో, ఎంతకఠినహృదయము నీది, నారాజా!

ప్రవరుడు

అమ్మా, నాకు వేళ అతిక్రమిస్తోంది. ఇంటికి వెళ్లాలి. చేతనైతే మార్గం చూపు.

వరూధిని

నన్ను మించినవస్తువులు నీయింటివద్ద ఏమి వున్నవని యింటికి వెడతానంటావు?

ప్రవరుడు

దేవతార్చనం ఒకటి.

వరూధిని

ఊఁ.

ప్రవరుడు

పితృపూజ రెండు.

వరూధిని

సరి, సరి!

ప్రవరుడు

ఇల్లాలు నాకోసం వేచి వుండడం మూడు.

వరూధిని

చాలు, చాలు—ఈపాటి! వారు నావలె వాయు తరంగాలమీద సంచారము చెయ్యగలరా?

ప్రవరుడు

వారికి నడక సహజము.

వరూధిని

వారు తమకంఠా లెత్తి విశ్వవీణారవముతో శ్రుతి కలుపుకోగలరా?

ప్రవరుడు

లేరు.

వరూధిని

శాపానుగ్రహసమర్థులా నావలె వారు?

ప్రవరుడు

తపోధనమువారు మెచ్చించరు.

వరూధిని

వారికి నావలె జరామరణా లంటకుండా వుంటవా?

ప్రవరుడు

స్థూలదేహంపైన వారికి నమ్మకం లేదు.

వరూధిని

హృదయపీఠాన నిన్ను నెలకొల్పి నీపాదా లర్చిస్తూ నీకమరత్వ మిచ్చి నీఅభీప్సితాలు నెరవేర్చగలరా నాస్వామీ, వారు?

ప్రవరుడు

కూడదు.

వరూధిని

మానవుల వూహాలకైనా అందని నందనవనకైలాసనీమలయందు అస్తమయ మెరుగని ఆనందసూర్యుణ్ణి ఉపాసించగలరా, వారు!

ప్రవరుడు

లేరు.

వరూధిని

వారికోస మెందుకు ఇంతగా పాకులాడుతావు వెర్రిరాజా!

ప్రవరుడు

ధర్మముకోసము.

వరూధిని

ధర్మము ధర్మమంటావు, ఎక్కడి ధర్మమిది! నీధర్మములకు ఫలము నేనిక్కడ నీకిస్తూంటే, వద్దని, తరువాత ఈ ధర్మాన్ని నీవేమి చేసుకుంటావు?

ప్రవరుడు

దైవమే అది నిర్ణయిస్తాడు.

వరూధిని

వలపా, ధర్మమా ముఖ్యము! ధర్మముపేరు చెప్పి ప్రేమభావాలు చంపుకుంటారా?

ప్రవరుడు

పాపభీతి అక్కరలేదా మనుష్యులకు?

వరూధిని

పాప మెందుకు?

ప్రవరుడు

నీవు పరకాంతవు.

వరూధిని

ఊఁ.

ప్రవరుడు

నేను నూతన పురుషుడను.

వరూధిని

ఎట్లు ?

ప్రవరుడు

ఎట్లేమి? అది సువిదితమే.

వరూధిని

అయ్యో, ఎక్కడిమాట లివి? మన మిద్దరమూ పాతస్నేహితులమే! మానవలోకాన్ని ఆవరించిన మాయ నీకన్నులు కప్పింది. అంతే. లేకుంటే ఈ దేవలోకంలో తృప్తి పొందనినామనస్సు నిన్ను కని తృప్తిపొందద మెందుకు?

ప్రవరుడు

నాపాప మది!

వరూధిని

కాదు, కాదు. ఇది పురాణపరిచయ ఫలమే.

ప్రవరుడు

ఏమో కాని, జీవితంలో ప్రేమ ఒక్కమారే.

వరూధిని

ఆఒక్కమారూ నీ వాప్రేమను అనుభవించావా?

ప్రవరుడు

నేను గృహస్థునే.

వరూధిని

మీ శాస్త్రాలు రెండవసూరు ప్రేమించడము నిషేధిస్తవా?

ప్రవరుడు

ధర్మశాస్త్ర సమ్మతమైతే నిషేధించవు.

వరూధిని

అయితే నన్ను తూలనాడుతా వెందుకు?

ప్రవరుడు

నీవు అమర్త్యవు.

వరూధిని

అవును.

ప్రవరుడు

నేను మర్త్యుడను.

వరూధిని

అవును.

ప్రవరుడు

భూతభవిష్యద్వర్తమానములు నీకు కరతలామలకములు.

వరూధిని

అయితే?

ప్రవరుడు

మేము సంకుచిత ప్రజ్ఞులము.

వరూధిని

కానీ.

ప్రవరుడు

సంకుచిత ప్రజ్ఞులకూ దేవతలకూ సంబంధం ఎలా పొసగుతుంది?

వరూధిని

ఎందుకు పొసగరాదు?

ప్రవరుడు

ఒకరి జీవనానికి మృత్యువు మేర; రెండవవారికి ఆనందము పరమావధి.

వరూధిని

మృత్యువును పోగొట్టి సంతతానందం నీ కిస్తానుగా నేను. అయినా మృత్యువు ఆనందపదవికి దారి చూపుతుంది కదా.

ప్రవరుడు

మానవులఊహాలకు కాదేమో!

వరూధిని

మీకు మాత్ర మెందుకు కాదు? మీలోక మంతా

జీవనతరంగాలలో ఆడుతున్నది. మీ రసులోనే మృత్యువు మార్పే కదా!

ప్రవరుడు

కావచ్చు, కాక పోవచ్చు. నిరవధికజీవులకే స్వేచ్ఛ. మేము కట్టు బాట్లను దాటిపోవడానికి స్వతంత్రులము కాము.

వరూధిని

[కోపము తెచ్చుకొన్నది. కుంతలములను వెనుకకు తోసింది. కన్నులు ఎక్కువగా సంచలిస్తున్నవి. అధరము కదులుతున్నది. జింక పిల్లను గట్టిగా దగ్గరకు లాగింది. నిలుచున్నది. ఒక మేఘము వచ్చి ఆమెను పల్చగా చుట్టుకొన్నది. మాటాడేటప్పుడు ఎదురుగా వున్న మేఘము చెదిరి, వూరుకున్నప్పుడు మళ్ళీ కలుసుకొంటున్నది. బయట చెట్లపైన పక్షులు పాట లాపినవి. వాయువు గమనము ఆపినాడు.]

నన్ను ఏమో సాధరణగా ఎంచి మాట్లాడుతునావు! నిన్ను ఈ పర్వతము మీదనే బంధించ గలశక్తి నాకు కలదు సుమా!

ప్రవరుడు

[చిరునవ్వుతో] ఊఁ!

వరూధిని

నీధర్మాలకు విఘ్నాలు కల్పించ గలశక్తి నాకు కలదు సుమా!

ప్రవరుడు

ఊ!

వరూధిని

నీస్థూలకాయాన్ని ఒక్కసారి నశింపజేసి నీ సూక్ష్మ దేహాన్ని గ్రహించ గలశక్తి నాకు కలదు సుమా!

[వరూధిని దేహము కంపిస్తున్నది.]

ప్రవరుడు

ఊఁ.

వరూధిని

[మణి సౌధమును మేఘములు చుట్టుకొన్నవి. ఒక మేఘము లోన ప్రవేశించింది. వరూధిని దానిపైన చేతి నానించి గద్గదస్వరముతో మాట్లాడుతున్నది.]

ఒక చేతితో నాహృదయ మిస్తున్నాను నీకు! రెండవచేతితో మృత్యు విస్తున్నాను! ఏది కావాలి నీకు!

ప్రవరుడు

నాయింటికి ద . . .

వరూధిని

అయ్యో, అయ్యో, అయ్యో!

[ఆమె కిందకూలబడింది. మరికొన్ని మేఘాలు వచ్చి ఆమెను చుట్టినవి. ఒక మేఘముపైన ఒకపాదము మోపి వేరొకమేఘముపైన చేతు లానించింది.]

నీకెంత భయం లేదు!

ప్రవరుడు

నా కెందుకు భయము?

వరూధిని

మృత్యువును చూపినా నీకు భయము లేదేమి మానవులకువలె?

ప్రవరుడు

నా దేహముకోసం ఇంత కొట్టుకొంటున్న నీవు నా దేహాన్ని నశింప జెయ్యగలవా?

వరూధిని

[మొగము చేతులతో కప్పుకొని]

లేను, నారాజా, లేను! ఇంతదాకా నీతో కఠినంగా మాట్లాడినాను. క్షమించు, క్షమించు!

ప్రవరుడు

ఈమాటు నాకింటికి దారి చూపించు.

వరూధిని

ఇప్పుడు చూపితే మళ్లీ రావేమో?

ప్రవరుడు

మరణానంతరమే.

వరూధిని

అమ్మో, వద్దు! ఈలోపుగానే రా!

ప్రవరుడు

నే వెళ్ళుతా. ని న్నింత వేడుకొన్నా నీకు దయ కల గడం లేదు. నాకష్టాలు నేనే పడతా యీకొండమీద, నీచేతులో ప్రాణాలు కోలుపోయేబదులు, పితృదర్శన సిద్ధికి ప్రయత్నాలు చేస్తూ మేను విడవడమే మంచిది!

వరూధిని

నీకే కష్టములు! నీవే మేను విడవడం! వద్దు వద్దు!

ప్రవరుడు

అయితే నాప్రాణాలు నిలుపు!

వరూధిని

నా మాట వినవుగా?

ప్రవరుడు

[లేచి గుమ్మమువద్దకు వచ్చి] నే వెళ్ళుతా.

వరూధిని

[దీర్ఘముగా ఆలోచిస్తూ చాలా సేపు మాట్లాడదు. చివరకు]

మళ్ళీ వస్తావుగా? సంకల్పమాత్రంచేత నీవు ఇక్కడకు రాగలవుసుమా! నేను ఆలాగ చేస్తున్నాను... ఊఁ. వెళ్లు! మరి వెళ్ళు! మళ్ళీ రావాలిసుమా నాకొం

డా! రా! యేం! ఈమేఘాలు నిన్ను తీసుకు వెళ్లుత విశే! నన్ను మరవకునుమా!

[ప్రవరుణ్ణి మేఘాలు అన్నివేపులా చుట్టుకోగా అతను అంత ర్హితు డవుతాడు. మణిపీఠముపైన వున్నవీణ దగ్గిరకు లాక్కొని వే ళ్లతో తీగెలు తెంపుతూ]

మానవులు ఎంతకఠినహృదయులు!

౧౯–౨౪